

# కథ

నందుల వెంకటేశ్వరరావు

# నేచురోపతి

ఉగ్రనరసింహంగారి కూతుర్ని పెళ్ళి చేసుకునేటప్పుడు తను నరసింహంగారికి అల్లుడిగా తగనేమో అన్న అనుమానం కలగలేదు శంకరానికి. నరసింహంగారిది విపరీతమైన లౌక్యం.

ఆయన లౌక్యంలో బంధువుల్ని అందులో స్వయానా అల్లుడ్ని కూడా వదల్లేదు. 'నాకున్నది ఇద్దరు కూతుళ్లైనా నా ఆస్తి స్వార్జితం కాబట్టి ఎవ్వరికైనా ఇవ్వచ్చు' అనే పాయింటుమీద రేపు నా ఆస్తిని నా రెండో కూతురికి నయాపైసా రాయకపోయినా ఆ విషయంలో రెండో కూతురి మొగుడివైన నువ్వు కోపం తెచ్చుకోవచ్చు. అందుకే భద్రతకు దూరపు బంధువువైనా నీకు కట్నం పేరిట పదిహేను వేలు ఇద్దామనుకుంటున్నాను."

"మీ ఇష్టం మామగారూ" శంకరం తృప్తిగా అన్నాడు.

"కట్నం ఇవ్వకపోయినా పార్వతిని ఆనందంగా చేసుకుంటాను"

"ఇదిగో వ్యవహారం మాట్లాడుతుంటే సెంటిమెంట్లు తీసుకురాకు. ఇప్పుడు పదిహేను వేలు ఇవ్వనా. లేకపోతే పెళ్ళి ఖర్చులకు వెయ్యి ఇచ్చి, ఒక అరెకరం పొలం రాయనా. అరెకరం పొలం అంటే ఈ రోజే ఇరవై వేలు. భవిష్యత్తులో పెరగవచ్చు."

"అరెకరం పొలమే ఇవ్వండి మామయ్యా" నోరు జారాడు శంకరం. అంతే అదిగో అప్పట్నుంచి దాని ఊసే లేదు. ఆయన పెట్టే లిటిగేషన్లకి ఎంతోమంది కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. కన్యాదానం ఆ తర్వాత గర్భాదానం, పిల్లలు పుట్టడం, పుట్టిన పిల్లలకు నామకరణం, వాళ్ళు పెరిగి పెద్ద అవడం ఇన్ని జరిగినా అరెకరం అల్లుడికి రాయడం జరగలేదు. ఇవ్వను అని చెప్పినా బాధ లేదుగాని ఇస్తానని తెలివితేటలు, లౌక్యం ఉపయోగించడం, జీర్ణించుకోలేకపోతున్నాడు శంకరం. కట్నాలకు వాయిదాలుండవా. మా మామగారు ఇస్తానన్న అర్ధనూటపదహార్లు కట్నం ఈ రోజుకీ ఇవ్వలేదు. ఇది శంకరం మామగారి వాదన.

మామగారు పేరు ఉగ్రనరసింహం అయినా ఆయన చాలా సాత్వికంగా, మేకలా ఉంటాడు. చిన్నతనంలో పెళ్ళి అయిందేమో, ఆయన అయిదడుగులకు కూడా ఎదగలేదు. కానీ ఇల్లాలు సీతారత్నం మాత్రం మంచి ఎత్తు ఒడ్డూ పొడుగులతో హుందాగా వుంటుంది. అయినా పాతకాలం పతివ్రతలా నరసింహంగారికి కోపం వచ్చినప్పుడు ఆయన మడత మంచం వేసుకుని దానిమీద నిల్చుని ఆవిడ్ని ఎగిరి లెంపకాయ కొట్టినప్పుడు వినమ్రంగా అందుకుంటుంది. ఒక్కోసారి బుద్ధి ఎదురు తిరిగినా దాన్ని అణిచేసుకుంటూ, "మా అల్లుడు ఆదర్శమూర్తి పైసాకట్నం తీసుకోలేదు" గొప్పగా పదిమందికీ చెప్పేవాడు గర్వంగా నరసింహం.

వెస్టుగోదావరి కరణాలు చాలామంది వైదీకులైనా ఈ నియోగం ఎలా అబ్బిందో తెలియదు మామగారికి. అసలా కరణం అన్న పేరులోనే నియోగం ఉందా. ఏది ఏమైనా మామగారంటే ఒక రకమైన నిర్లిప్తత పెరిగింది శంకరానికి. అందుకే మామగారి గురించి పార్వతి ఏం చెప్పినా అంత ఉత్సాహం చూపించడు శంకరం. ఏం తెచ్చి మీద పడేస్తాడో అన్న భయం. మరో విషయం ఏంటంటే అత్తగార్కి, మామగార్కి బ్రహ్మాండమైన చెవుడు. అందుకని అన్యోన్య దాంపత్యం.

* * *

"మా అమ్మా, నాన్న వస్తువున్నారు" పార్వతి నెమ్మదిగా చెప్పింది శంకరానికి. మొహం చిట్లించాడు శంకరం. ఆయన పెట్టే చికాకుతో బోలెడు తగాదాలు వస్తాయి చుట్టుపక్కల వాళ్ళతో. ఆయన అందర్నీ అదమాయిస్తాడు. పాలవాళ్ళు పెరుగువాళ్ళు, బియ్యం, కిరాణా, నెయ్యి, ఎవర్నీ వదలడు. అన్నిట్లో కల్తీలని హడావుడి చేస్తాడు. పూర్వకాలంవాడే 'కానిస్టీపుని పిలుస్తాను' అని బెదిరిస్తాడు. అంతేకాదు రాగయుక్తంగా రోజూ గంట పురాణం వినిపిస్తాడు భార్యకి. ఆవిడ పొరపాటున కునికిపాట్లు పడితే తిట్ల పురాణం లంగించుకుంటాడు. చుట్టుపక్కల వాళ్ళతో బోలెడు గొడవలు.

"మా నాన్న ఇప్పుడు చాలా మారిపోయాడు" పార్వతి నేల దిక్కులు చూస్తూ చెప్పింది. "ఆయనెవడో టి.విలో రోజూ కనబడుతున్నాడు ప్రకృతి వైద్యుట్ట. ఆయన వైద్యం అనుసరిస్తున్నాడు. అక్కడెక్కడో ప్రకృతి కేంద్రానికి వెళ్ళి మూడు నెలలువుండి వచ్చారు అమ్మా, నాన్న" పార్వతి చెబుతోంది.

"రోజూ అయిదులీటర్ల నీళ్ళు తాగాలిట. పచ్చి కూరలు తినాలిట" ఆశ్చర్యపోయాడు శంకరం.

"రోజుకు అయిదు లీటర్లు కాకపోతే ఏభై లీటర్లు తాగమను. లేకపోతే మునిసిపాలిటీ టాంకరుని ఇంటి దగ్గరే పెట్టిస్తాను. అయితే పూర్వంలా విపరీతమైన ఖర్చులు, కిరాణా అప్పులు ఉండవన్నమాట. సంతోషం. అయినా ఖర్చులు ఆయనవి. డబ్బులు ఇవ్వాల్సినది నేనా. ఈ అలవాటు ఎక్కడిదే మీ నాన్నకి. పచ్చి కూరలు తినాలా, తినమను. ఎన్ని తింటాడులే. అయినా మీ నాన్న టి.వి. ఎలా వింటున్నాడు చెవుడు గదా" ఆశ్చర్యం వ్యక్తపరిచాడు శంకరం.

"లేదు లెండి మిషను పెట్టుకుంటున్నారు అమ్మా, నాన్న" నిష్టూరంగా అంది పార్వతి. "ఎప్పుడూ మీ నాన్నా, మీ అమ్మా అనకుండా మా మామగారు, మా అత్తయ్య అనలేరా"

"ఆ సరేలే, వాళ్ళు చేసే పన్లకి అంత ఆప్యాయత కూడానా. అన్నీ తిన్నగా ఉంటే అలాగే అంటాలే" హామీ ఇచ్చాడు శంకరం.

* * *


హంగూ, ఆర్భాటాలతో మామగారూ, అత్తగార్ల ఆగమనం శుభారంభం అయింది. వచ్చిన రోజే శంకరాన్ని కూచోబెట్టి చిన్న లెక్చరు ఇచ్చాడు మామగారు.

"ఆ మధ్య బజార్లో నడుస్తుంటే వళ్ళు తూలింది. రాజు డాక్టరుగారికి చూపిస్తే ఆయన కొద్దిగా రక్తపోటు ఉందన్నాడు. పైగా అసలు నరసింహంగారూ, ఉద్యోగంచేస్తే ఈపాటికి రిటైరై విశ్రాంతి తీసుకోవాల్సిన వయసు. మీకింకా ఈ ఝంఝాటం దేనికి. ఆ ముప్ఫై ఎకరాల ఆస్తీ ఇద్దరు కూతుళ్ళకూ రాసేసి హాయిగా కృష్ణారామా అంటూ వాళ్ళ పంచన పడుండండి" అని కూకలేశాడు.

శంకరం కళ్ళనీళ్ళు తిరిగాయి. పాపం ఆయనకు

మాత్రం ఎవరున్నారు. కూతుళ్ళేగా. అందుకే మనస్ఫూర్తిగా అన్నాడు. "ఇక్కడే ఉండిపొండి మామగారూ, మీరూ అత్తగారూ. ఆ పల్లెటూళ్ళో ఏం అవస్థపడతారు" ఆర్ద్రంగా అన్నాడు.

"ఆ తర్వాత దేవుళ్ళా ఈ వైద్యుడు వచ్చాడు మా ఊరికి. ఆయన అన్నీ విడమర్చి చెప్పాడు. అసలు ప్రకృతిలోనే మన రోగాన్ని నిరోధించే శక్తి తయారవుతుందిట. కానీ మనమే దాన్ని కలుషితం చేసుకుంటున్నాట. జంతువులు, పక్షులు ఈ రోగ నిరోధకాల్ని వాడుకుంటాయి. కుక్క ఏదైనా తోలు ముక్కలు తింటే, అరగని ఆ ముక్కల్ని పచ్చగడ్డి తినడం ద్వారా వాంతి చేసుకుంటుందిట. మనం తినే ఉప్పు ఏడాదిపాటు ఊరేసే ఊరగాయలు అన్ని చెడ్డే. కొన్ని పుస్తకాలు కూడా వ్రాశాడాయన. రోజూ అయిదు లీటర్ల మంచి నీరు, పచ్చికూరగాయలు, పళ్ళు తప్ప ఏమీ పుచ్చుకోవద్దన్నారు. నాకు గురి కుదిరింది. మీ అత్తయ్య చేత కూడా మొదలు పెట్టించేశాను"



"ఇదిగో తెస్తున్నావా" ఒక కేక పెట్టాడాయన.

"ఆ వచ్చే వచ్చే" ఆవిడ ఏదో పెట్టి తెచ్చింది. 'కొంపదీసి ఆస్తి సమానభాగాలు చేసి రిజిస్ట్రీ చేయించి తెచ్చిన డాక్యుమెంట్లా' ఆశ్చర్యపోయాడు శంకరం.

ఆయన పెట్టెతీసి పింగాణీ బొచ్చెలు రెండు, రబ్బరు ట్యూబు చివర ఇంకుపిల్లరులాంటి సాధనం తీశాడు. అదేమిటో అర్థం అయింది శంకరానికి. అది ఎనీమా. అతడి అత్తయ్య అదే వాడేది. అది చూస్తే అతడికి ఎలర్జీ. శంకరానికి డోకు వచ్చినట్లయింది. భోజనం చేసేటప్పుడు హార్లిక్, డోమెక్సు ఎడ్వర్‌టైజ్‌మెంట్లు వస్తాయని టి.వి.కూడా పెట్టడు శంకరం.

"దీన్ని ఎనీమా అంటారు. ఈ సబ్బుతో నీళ్ళు తయారు చేసుకుని..." మామగారు చెబుతూనే ఉన్నాడు.

"చెప్పకండి" అరిచాడు శంకరం. కానీ మామగారికి వినబడదు. విషయం అంతా విపులీకరించేలోగా శంకరానికి తిన్న అన్నం అంతా వాంతి అయింది.

★ ★ ★

ప్రొద్దుట లేచేసరికి కూరలవాడితో గొడవ పడుతున్నాడు మామగారు. "వీరయ్యా ఎందుకు గొడవ ఆయనకి కావాల్సిన కూరలు ఇయ్యి" లోపల్నుంచే చెప్పాడు శంకరం. "అలాగే అయ్యా" వినయంగా చెప్పాడు వీరయ్య.

ఎనిమిది గంటల వేళ స్నానానికి వెళుతుంటే రెండు కత్తిపీటలు వేసుకుని కూరలు తరుక్కుంటున్నారు అత్తమామలు. చుట్టూ రెండు పెద్ద ఆనపకాయలు, కేజీ టమోటా, కేజీ కాకరకాయలు, ఆరు పొట్లకాయలు ఉన్నాయి. ఆనపకాయలు నోట్లో నీరూరతాయి. పొట్లకాయలు గబ్బుకంపు. కాకరకాయలు చేదు. ఎలా తింటారో ఆశ్చర్యపోయాడు శంకరం.

స్నానం చేసి వచ్చేసరికి కూరలు తరిగి గుట్టలుగా ఉన్నాయి. మళ్ళీ అరగంటలో శంకరం భోజనానికి వచ్చేసరికి పచ్చికూర ముక్కలన్నీ మాయమయ్యాయి. దొండకాయలు, తోటకూర కూడా తరిగి తింటున్నారు అత్తామామలు. 'ప్రకృతివైద్యం ఆయన ఏం చెప్పాడో, వీళ్ళేం తింటున్నారో' అనుకున్నాడు శంకరం. దొండకాయలు తినేవాళ్ళను చూస్తే అతనికి ఎలర్జీ.

★ ★ ★

పదకొండుగంటల వేళ ఏదో ఆఫీసు ఫైలు మర్చిపోవడంతో ఇంటికి వచ్చాడు శంకరం. మామగారు దిగాలుమొహంతో కూర్చుని ఉన్నాడు. "నీరసంగా

ఉంది" అంటూ చంటిపిల్లాడిలా మారాం చేస్తున్నాడు. అత్తగారు ఓదారుస్తోంది. "కాస్త ఇంకోగంట ఓపికపట్టండి. లంచ్‌కింకా సమయం కాలేదు. పళ్ళు వలుస్తున్నా. ముక్కలు కోస్తున్నానా. ఇదిగో జ్యూస్ కూడా అయిపోవచ్చింది."

పెద్ద పెద్ద పళ్ళాలలో ఏపిల్ ముక్కలు, బొబ్బాస ముక్కలు, జామ, అనాస ముక్కలు కమలా తొనలూ కొండల్లా పేర్చి ఉన్నాయి. రెండు జగ్గులతో బత్తాయి రసం, ఒక జగ్గుతో దానిమ్మరసం తీసి ఉన్నాయి. గుండెగుభేలుమంది శంకరానికి. ప్రొద్దుటి బ్రేక్‌ఫాస్టు కంటె డబల్ వుంది లంచ్. ప్రకృతి వైద్యం చాలా కాస్ట్లీ లాగుంది. కనీసం పదిహేను ఆపిల్స్, పాతిక కమలాలు, ఆరు బొబ్బాసపళ్ళు, పదిహేను జామకాయలు, ఇరవై దానిమ్మ, ఓ ముప్పై బత్తాయిలైనా ఉపయోగించి ఉండాలి. ఓ ప్రక్క కేజీ సీసాలతో రెండు తేనె సీసాలు ఉన్నాయి. ఈ లెక్కన మామగారు ఇంకెవరికీ ఆస్తి రాయనక్కరలేదు. ఆయనకే సరిపోతుంది.

మధ్యాహ్నం తిన్నదేమయిందోగాని మామగారు అత్తగారి దగ్గర గునుస్తున్నాడు రాత్రి. "చాలా నీరసంగా ఉందే"

"మధ్యాహ్నం సెనగలూ, పెసల మొలకలు తిన్నారు కదా. ఓర్చుకోండి కాస్సేపట్లో హార్లిక్స్ కలిపి ఇస్తాను" అత్తగారు ఓదారుస్తోంది.

* * *

దొడ్లో చిన్న మట్టిపోగు కనబడింది శంకరానికి. పార్వతి మళ్ళీ మొక్కలు పెంచుతోందేమో అనుకున్నాడు.

ఆ రోజు తెల్లవారగట్ల ఇబ్బందయి టాయ్‌లెట్ కోసం దొడ్లోకి బయల్దేరాడు. తలుపుతీయగానే మసక చీకట్లో రెండు దుంగలు కదుల్తున్నట్లు భ్రమ. అంతలోనే ఆ నల్లదుంగల మధ్య తెల్లటి కాంతి. జడుసుకున్నాడు శంకరం.

"యేమే అల్లుడూ" ఇకిలిస్తున్నాడు మామగారు. అది మడ్‌బాత్‌ట. మూడుగంటలు పూసుకుని ఎండలో పడుకోవాలిట. కిరాణాకొట్టువాడు నమస్కారం చేసి చెప్పాడు శంకరానికి "మీ మామగారు మంచి క్వాలిటీ సరుకులు కావాలన్నారు. పెద్దబజారులో మన హోల్‌సేల్ కొట్టునుంచి ఏర్పాటు చేస్తున్నాను"

ఇంటికి వచ్చాకా అత్తగారూ, మామగారూ టీ.వి. ముందు కూర్చుని ప్రకృతి వైద్యం ఆయన ఉపన్యాసం వింటున్నారు.

"మా అమ్మానాన్నల్ని చూశారా! ఇంత ఆనందంగా ఎప్పుడూ లేరు" పార్వతి నవ్వుతూ అంది ఆనందంగా.

"అవును నిజమే. ఆ ఉపన్యాసం ఏం వింటున్నారో. నీక్కూడా చెవుడు వచ్చినట్లుంది. ఆ టీ.వి.మ్యూట్‌లో ఉంది. ఏం నొక్కబోయి ఏం నొక్కారో" సరిచేస్తూ అన్నాడు శంకరం. "అయినా వీళ్ళకి కిరాణా అవసరం లేదన్నావు ఆ కిరాణావాడు హోల్‌సేల్‌లో తెప్పిస్తున్నానని చెప్పాడు"



అదా మామగారు చెప్పాడు. "రాత్రి డిన్నర్‌కి మేము జీడిపప్పు, బాదం, కిస్‌మిస్, పిస్తా అన్ని డ్రై ఫ్రూట్స్ తింటాం అల్లుడూ! ఆ తర్వాత హార్లిక్స్ తాగి పడుకుంటాం."

గుండె గుభేలుమంది శంకరానికి. 'ఇవన్నీ అరాయించుకునేటందుకు వీళ్ళది కడుపా ఖండవిల్లి చెరువా అని' అనుకున్నాడు.

* * *

ప్రొద్దుట లేచేసరికి కూరలవాడు బుర్రగోక్కుంటూ నిలబడ్డాడు. "ఏం వీరయ్యా" అడిగాడు శంకరం. "కాస్త డబ్బు చెల్లు వేస్తారేమోనని అలాగే కొంత ఎడ్వాన్సు ఇస్తే మా బావమరిది తోట తీసుకుందామని" నసిగాడు.

"ఎంతయింది" ఆశ్చర్యపోయాడు శంకరం. "రోజూ మూడువందల దాకా అవుతోందయ్యా. పదిహేను రోజులకూ నాలుగువేల మూడు వందలయింది. అదిచ్చి మరో అయిదు వేలు ఎడ్వాన్సు ఇప్పించండి"

"అది మా మామగారి ఖాతా గదా" అయోమయంగా అన్నాడు శంకరం. "మిమ్మల్ని అడిగి పుచ్చుకోమన్నారు" వీరయ్య వినయంగా చెప్పాడు. గుండె ఆగినంత పనయ్యింది శంకరానికి. కూరలవాడికే ఇంత అయితే మిగతా ఖాతాలెంత అయ్యాయో.

కిరణాకొట్టు, పాలు, పళ్ళు అన్నీ లెక్కవేస్తే పదిహేను వేలు పైనే అయింది. "తను తిరిగి వచ్చేసరికి అత్తమామలు ఇల్లు వదిలిపోవాలని, లేకపోతే పార్వతి కూడా ఇల్లు వదలాలని" అల్టిమేటం జారీ చేసి తనకు పిత్రార్జితంగా సంక్రమించిన ఎకరం పొలం అమ్మడానికి బయల్దేరాడు అల్లుడు శంకరం. అత్తమామల పదిహేనురోజుల నే'చురో'పతి చ్రుమంటుండగా. ○

# సోయగాల సుందరి

జూనియర్ ఎన్టీఆర్ హీరోగా నటిస్తున్న 'అదుర్స్' సినిమాలో కేరళ కుట్టి నయనతార బికినీలో దర్శనమిస్తోందని ఫిలింనగర్‌లో తెగ చెప్పేసుకుంటున్నారు. తమిళ చిత్రం 'బిల్లా'లో బికినీతో కనిపించి సంచలనం సృష్టించిన నయనతార పుణ్యామాని మరికొంత తారలు కూడా బికినీ మోజులో పడిపోయారు. తెలుగు 'బిల్లా'లో కూడా అనుష్క బికినీతో దర్శనమిచ్చింది. 'ద్రోణ'లో ప్రియమణి కూడా బికినీలో కనువిందు చేసింది. ఇప్పుడు రాబోయే 'అదుర్స్'లో నయనతార బికినీతో అదరగొట్టబోతోందిట.